క్లుప్తంగా

భేతాళ ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకుంటాం



ఎస్పీ శ్రీధర్‌ను కలసిన ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ఈ నెల 29న అంబాజీపేటలో నిర్వహించే విజయ భేతాళ స్వామి ఉత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుంటామన్నారు. అందుకు సహకరించాలని అమలాపురం ఎస్పీ శ్రీధర్‌ను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మర్యాద పూర్వకంగా మంగళవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఏటా శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే భేతాళ ఉత్సవాన్ని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జరుపుకొంటామన్నారు. ఎస్పీని కలసిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, నాయకులు గుత్తుల శ్రీను తదితరులు ఉన్నారు.

డాక్టర్ అప్పారావు కన్నుమూత



డాక్టర్ ఏవీ అప్పారావు

రాజోలు: ప్రముఖ వైద్యుడు ఆమంచి వెంకట అప్పారావు (71) కన్నుమూశారు. ఆయన మృతికి మంగళవారం రాజోలులోని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. రాజోలు పరిసర ప్రాంత వాసులకు డాక్టర్ అప్పారావు ఎన్నో విధాలుగా వైద్యసేవలు అందించారు. ఆల్ ఇండియా డాక్టర్స్ సంఘం ద్వారా పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహించారు. రాజోలు ఆంజనేయస్వామి, శివాలయం పునర్నిర్మాణ పనులకు, వేద పాఠశాల, వేద సభల నిర్వహణకు ఎంతో సహకారం అందించారు. ఆయన మృతికి సీనియర్ న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు, సర్పంచ్ రేవు జ్యోతి, రోటరీ ప్రతినిధి దార్ల పెదబాబు, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కుంపట్ల చిన్నారి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ముక్తేశ్వరుని భూమిలో అరటి, మామిడి

అయినవిల్లి: వనమహోత్సవంలో భాగంగా అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలోని క్షణ ముక్తేశ్వరస్వామికి చెందిన ఎకరా 11 సెంట్ల భూమిలో అరటి, మామిడి మొక్కలు నాటారు. అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో అరటి మొక్కలను పాతారు. ఇందులో 700 మామిడి మొక్కలు ఉన్నాయి.

అక్రమాలు అరికట్టాలంటూ ఆందోళన

మామిడికుదురు: అప్పనపల్లిలో ఇసుక రీచ్‌లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు మంగళవారం నిరసన చేపట్టారు. ట్రక్కు ఇసుకను రూ.2,812లకు అమ్మాల్సి ఉండగా రూ.3,100కు అమ్ముతున్నారని ఆరోపించారు. దీంతో పాటు తక్కువ ఇసుక లోడ్ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులకు తక్కువ ధరకు ఇసుక అందించాలని నినాదాలు చేశారు. ఇసుక రీచ్ వద్ద తమ ఆందోళనను తెలియజేశారు. ఈ నిరసనలో వైఎస్సార్ సీపీ నేతలు గెద్దం వెంకటేశ్వరరావు, బత్తుల జనార్దనరావు, గూటం శ్రీను, గెద్దం నాగరాజు, లంకే ఏసు, గెద్దం రాంబాబు, యన్నాబత్తుల రాజేష్, పాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల పేరు చెప్పి ఫోన్లు వస్తే మోసపోవద్దు

అయినవిల్లి: గుర్తుతెలియని వ్యక్తులు మీ వలంటీర్లు అని చెప్పి లబ్ధిదారులకు ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతున్నట్లు ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య తెలిపారు. ఇటువంటి ఫోన్లు వస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్ చేసిన వ్యక్తి మొదటి మీ వలంటీరా కాదా రుజువు చేసుకోవాలన్నారు. అప్పుడే అ కాల్‌కు సమాధానం ఇవ్వాలన్నారు. కొందరు వలంటీర్ పేరు మీకు అమ్మఒడి డబ్బులు పడ్డాయని మీ బ్యాంక్ ఖాతా వివరాలు తెలపాలని ఓటీపీ వస్తుంది చెప్పమని అడిగి సైబర్ క్రైమ్‌కు పాల్పడుతున్నారు. లబ్ధిదారులు ఎవరూ ఫోన్లో అడిగిన వారికి బ్యాంక్ ఖాతా వివరాలు గానీ ఓటీపీ నంబర్ గాని చెప్పవద్దని అన్నారు. మీకు అమ్మఒడి సొమ్ములు పడింది. లేనిది తెలుసుకోవాలంటే సచివాలయానికి మాత్రమే వెళ్లి తెలుసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటన ఎదురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1931 ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తనిఖీ

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. కళాశాలలో క్వార్టర్లీ పరీక్షలు జరుగుతున్న తీరును, నాడు–నేడు పనులను పరిశీలించారు. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు 100 రోజులు సమయం కూడా లేదని ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేయకుండా చదివేలా, మంచి ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ప్రిన్సిపాల్ గోపాలకృష్ణకు సూచించారు.

అన్నపూర్ణా నమోస్తుతే..



ఈదరాడలో జరిగిన లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



అంబాజీపేటలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



అన్నపూర్ణాదేవి అలంకరణలో కొత్తపేట వాసవీమాత



పి.గన్నవరంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



పెదపళ్లలో అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత

- అమ్మవారి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ
- మహిళల సామూహిక కుంకుమ పూజలు

మామిడికుదురు: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం పాశర్లపూడిబాడవలో కొలువుదీరిన కనకదుర్గమ్మ గాయత్రీదేవి అవతారంలో భక్తులను కనువిందు చేశారు. ఈ ఆలయంలో శత చండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తోరం వెంకటరమణారావు ఆధ్వర్యంలో ఈ పూజలు జరుగుతున్నాయి. పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గమ్మ చంద్రఘంట అవతారంలో భక్తులకు రమణీయంగా దర్శనమిచ్చారు. ఈదరాడ కాలువ గట్టు దుర్గమ్మ ఆలయం వద్ద లక్ష కుంకుమార్చన పూజలను ఘనంగా జరిపించారు. మామిడికుదురు విజయదుర్గమ్మకు స్వర్ణ పుష్పాలతో విశేష అర్చన నిర్వహించారు. మొగలికుదురు గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని నగరం, పెదపట్నం, గెద్దాడ, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం గ్రామాల్లోని కనక దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: దేవి శర్నవరాత్రుల్లో భాగంగా అంబాజీపేట వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దుర్గమ్మా చల్లంగా చూడమ్మా అంటూ మహిళలు మంగళవారం ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచారు. అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద ఉన్న విజయ కనకదుర్గ ఆలయంలోను, మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మారిని చంద్ర ప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. పెద్దవీధిలో ఉన్న భేతాళ స్వామి ఆలయంలోను విజయ భేతాళుడికి, మాచవరం పక్షుల రావిచెట్టు వద్ద శ్రీరాంనగర్‌లోను ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: దసరా మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మండలంలోని దుర్గాదేవి ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొరుసువారిసావరం కనకదుర్గాదేవి అమ్మవారిని మమాలక్ష్మీదేవిగా అలంకరించారు. సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వాడపాలెం జ్ఞానసరస్వతీదేవికి పూజలు నిర్వహించారు. ఏనుగులమహల్, బోడిపాలెం ఆలయాల్లో ఆయా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: దసరా మహోత్సవాల సందర్భంగా స్థానిక ఏజీ రోడ్డులో వేంచేసిన లక్ష్మీ కనకదుర్గమ్మ, తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారు మంగళవారం అన్నపూర్ణదేవి అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జి.పెదపూడిలో వేంచేసిన వైష్ణవి కనకదుర్గమ్మ వారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. తాటికాయలవారిపాలెంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు.

ఆలమూరులో..

ఆలమూరు: శరన్నవరాత్ర మహోత్సవాలు పురస్కరించుకుని దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణదేవిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొల్పిన దేవి మండపాల్లో అమ్మవారిని అన్నపూర్ణదేవి అలంకారంలో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయా మండపాల్లో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

అయినవిల్లిలో..

అయినవిల్లి: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అయినవిల్లి, ముక్తేశ్వరం, విలస, సరిపల్లి తదితర గ్రామాల్లో అమ్మవార్ల ఆలయ భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ కమిటీ సభ్యుల నేతృత్వంలో మహిళలు అమ్మవారికి విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు జరిపారు. లలిత సహస్రనామ పారాయణ చేశారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన



ఈతకోటలో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పని చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం ఈతకోట సచివాలయం–2 పరిధిలోని జమ్మిచెట్టు సెంటర్, శెట్టిబలిజ ఏరియా, గంటి రోడ్డు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల్లో చెప్పినవే కాకుండా చెప్పనివి కూడా చేశారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. ఇంకా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గతంలోలా కమీషన్లు, లంచాలు అవసరం లేకుండానే అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజారోగ్యం, విద్యారంగాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఏ ప్రభుత్వంలో చెయ్యని విధంగా పరిపాలన చేసి ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వి.సుబ్బరాజు, సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, వత్సవాయి బాబీరాజు, చింతారావు, వైపీ, యర్రంశెట్టి కాశీకృష్ణ, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సెక్రటరీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించిన జేసీ



నగరంలో ఆర్‌బీకేలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ నుపూర్ అజయ్

మామిడికుదురు: నగరంలో రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ మంగళవారం పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదుపై ఆమె ఆరా తీశారు. వీఆర్వో ఐడెంటిఫికేషన్ పూర్తి అయ్యిందా? లేదా? అన్న అంశాలను పరిశీలించారు. మండల పరిధిలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఏఈఓ బి.మృదుల జేసీకి తెలిపారు. రెవెన్యూ అధికారులు, వ్యవసాయ శాఖ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కోతల నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జేసీ నుపూర్ అజయ్ సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ ఉన్నారు. 216వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ పనులను జేసీ ముందుగా పరిశీలించారు. అనంతరం ఆర్‌బీకేను సందర్శించారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

రావులపాలెం: యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ ప్రభుత్వం ముందుకు వెళుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక శ్రీ సంహిత డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్–ట్రినింగ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉద్యోగ మేళాను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో సుమారు 1000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 584 మంది హాజరు కాగా, 17 కంపెనీల్లో 215 మందికి ఉద్యోగం పొందినట్టు నైపుణ్యాధికారి లోకమాన్ తెలిపారు. కార్యక్రమంలో సంహిత విద్యాసంస్థ చైర్మన్ దినేష్‌బాబు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సుపరిపాలనతో గ్రామ స్వరాజ్యం



శివకోడులో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనతో గ్రామ స్వరాజ్యానికి బాటలు వేశారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం శివకోడులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాపాక నిర్వహించారు. శివకోడులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే రాపాక వివరించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ ఆర్థిక తోడ్పాటు అందించారన్నారు. గ్రామాల్లోని మహిళలు, చేతివృత్తులు, వ్యవసాయదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సంక్షేమ పథకాలు దోహదపడతాయన్నారు. అన్ని రంగాలను బలోపేతం చేయడం ద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో నిలుస్తాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా విజయపథంలో నిలపాలని కోరారు. సర్పంచ్ నక్కా రామారావు, రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, జిల్లా గ్రీవెన్స్ సభ్యుడు కటకంశెట్టి ఆదిత్య, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి, సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి, మాజీ సర్పంచ్ కసుకుర్తి రామకృష్ణ, ముప్పర్తి త్రిమూర్తులు, కొల్లాబత్తుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



వెదిరేశ్వరంలో విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెదిరేశ్వరంలో రూ.3 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ట్రాన్స్‌కో ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తితో కలసి ప్రారంభించారు. అలాగే గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.4 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్ సారథ్యంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వెదిరేశ్వరంలో సబ్‌స్టేషన్‌ను ఈరోజు ప్రారంభించామన్నారు. అలాగే ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో, ఆలమూరు మండలం నర్సిపూడి, ఆత్రేయపురం మండలం వాడపల్లిలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అవి కూడా అతి త్వరలోనే కార్యరూపం దాల్చానున్నాయన్నారు. నియోజకవర్గంలో రోజు రోజుకి పెరుగుతున్న కరెంటు వాడకానికి అనుగుణంగా ఆత్రేయపురం మండలంలో ఒక మెగా సబ్‌స్టేషన్ నిర్మించాలని ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే నియోజకవర్గంలో చాలా వరకు రోడ్లు నిర్మించుకున్నామని, 57 గ్రామాలలో ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టామని, సంక్షేమ పథకాలను ఏ విధంగా అయితే సమర్ధవంతంగా అమలు చేస్తున్నామో అభివృద్ధి కూడా అలాగే చిత్తశుద్ధితో చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సర్పంచులు బొక్కా కరుణాకరం, అంబటి సుబ్బలక్ష్మి, రెడ్డి చంటి, మాజీ జెడ్పీటీసీ సాకా ప్రసన్నకుమార్, మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యవర్మ, చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, ఆర్డీఓ ముక్కంటి, ట్రాన్స్‌కో ఏడీఈ డి.శ్రీనివాస్, ఏఈలు వీఎస్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

రావులపాలెం: రైతులకు అన్ని విధాలా మేలు జరిగేలా చూడటమే జగన్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఊబలంక లంకలో వ్యవసాయ భూమిలో 5 మోటర్లకు రూ.12 లక్షలతో కిలోమీటర్ మేర సబ్సిడీపై ఏర్పాటు చేసిన కరెంటు లైన్లను స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలసి జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఊబలంకలో రూ.12 లక్షలతో 26 పోల్స్ వేశామని ప్రభుత్వం నుంచి సబ్సిడీ రూపంలో రూ. 9 లక్షలు మంజూరు అవుతుందన్నారు. రైతులకు ఎంతో ఉపయోగపడే మంచి పనులకు ముందుకొచ్చి సహకరించిన నాయకులను, అధికారులను అభినందించారు. ఇదే విధంగా ఆత్రేయపురం మండలం నార్కెడ్‌మిల్లి లంకలో పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోకి వస్తున్న మన రైతుల పొలాలకు కూడా లైన్లు వేయించామని, ఆత్రేయపురం గ్రామంలో ఎస్సీపేటలో కూడా రైతులకు కరెంటు లైన్లు వేయించామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లిడి రామిరెడ్డి, కొక్కిరగెడ్డ అబ్బులు, మేడపాటి శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో ఏడీఈ డి.శ్రీనివాస్, ఏఈ వీఎస్ సుధాకర్, సెక్రటరీ బూసి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యం

- ఎమ్మెల్యేలు చిట్టిబాబు, జగ్గిరెడ్డి
- జోరుగా ఆరోగ్య సురక్ష శిబిరాలు



జి.అగ్రహారం సురక్ష శిబిరంలో వృద్ధురాలి ఆరోగ్య సమాచారం తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



వెదిరేశ్వరం సురక్ష కార్యక్రమంలో వృద్ధులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

అంబాజీపేట: పేదలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమూల సంస్కరణలు తీసుకువచ్చారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామంలో 4300 మందికి 1150 టోకెన్లను వైద్య సిబ్బంది అందించారన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో 550 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, వాసంశెట్టి చినబాబు, పులిదిండి ఏడుకొండలు, రాయుడు షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

రావులపాలెం: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను గ్రామాల్లో నిర్వహిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెదిరేశ్వరం సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వెల్నెస్ సెంటర్ భవనం వద్ద నిర్వహించిన ఈ క్యాంప్ ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్యాంపుల ద్వారా 105 రకాల మందులను ప్రజలకు ఉచితంగా ఇస్తారన్నారు. అలాగే హార్ట్ అటాక్ వచ్చిన వారికి రూ.40 వేలు ఖరీదైన ఇంజక్షన్ ఇవ్వడంతో వారిని ప్రమాదం నుంచి రక్షించుకునే అవకాశం ఉందని పేదవారికి కూడా ఇటువంటి వాటిని అందుబాటులో ఉంచాలన్నా ఉద్దేశంతో అటువంటి ఇంజక్షన్ కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆసుపత్రులో ఉంచుతుందన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన కోసం ఏర్పాటు చేసి పౌష్టికాహారం స్టాల్స్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సర్పంచులు బొక్కా కరుణాకరం, అంబటి సుబ్బలక్ష్మి, దొమ్మేటి అర్జునరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: బి.సావరం పంచాయతీ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. బి.సావరం సర్పంచ్ కడియం రమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. శిబిరంలో వైద్య సేవలు పొందిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు కంచి వెంకటరమణ, ఎంపీటీసీ బత్తుల హేమలత, పాలగుమ్మి సర్పంచ్ వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ కుంపట్ల మంజులతాదేవి, కంచర్ల శేఖర్ పాల్గొన్నారు.

కొత్తపేట: మండలంలోని పలివెలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని అముడా చైర్మన్ డేవిడ్‌రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఏ ఒక్కరూ బాధపడకూడదు.. ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకుని వైద్యం పొందడం ద్వారా ఆరోగ్య జీవనం గడపాలనే సత్‌సంకల్పంతో సీఎం జగన్ 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. అవిడి పీహెచ్‌సీ వైద్యులతో పాటు స్పెషలిస్టులు, సిబ్బంది శిబిరానికి వచ్చిన ప్రజలకు వివిధ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గునిపే శ్యామల, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ పానుగుపాటి సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు తులా సూరిబాబు, దేవస్థానం చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని చేకూర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం మెరుగైన ఫలితాలను అందిస్తుందని వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి, సర్పంచ్ లు నేలపూడి లావణ్య, చింతపల్లి వెంకటలక్ష్మి అన్నారు. ఆలమూరు గ్రామ సచివాలయం–3 పరిధిలోని సూర్యారావుపేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో కె.జాన్‌లింకన్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.జానకి రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించిన 324 మందికి మెరుగైన వైద్య సేవలు అందించి 105 రకాల మందులను ఉచితంగా అందజేశారు.

మామిడికుదురు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి పేర్కొన్నారు. మగటపల్లిలో ఏర్పాటు చేసిన సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు భూపతిరాజు సత్తిబాబురాజు, బొలిశెట్టి భగవాన్, సూరిశెట్టి బాబి, కాండ్రేగుల వెంకటరెడ్డి, పాటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతున్నదని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ముంగండపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు మంగళవారం ప్రారంభించారు. శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. మొత్తం 223 మందికి వైద్య సేవలు అందించారు. ఎంపీడీఓ ఎం.భారతి, ఎంపీటీసీ యాండ్ర విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశిరాజు సీతారామయ్య, కుడుపూడి నాగార్జున, మట్టపర్తి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి బీవీవీ సత్యనారాయణ, వైద్యాధికారి కె.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: నేదునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. సుమారుగా ఈ కార్యక్రమంలో 608 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరికి ప్రభుత్వం అందించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఎం.ప్రభాకరరావు, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, పంచాయతీ కార్యదర్శి గిడుగు సూర్యనారాయణమూర్తి ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక కుంకుమార్చనలు

ఆలమూరు: మండలంలోని చింతలూరు నూకాలమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో బుధవారం సామూహిక కుంకుమార్చనలు జరగనున్నట్లు ఆలయ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. దేవి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసే ఈ పూజల్లో పాల్గొనే ఎటువంటి రుసుం చెల్లించవలసిన అవసరం లేదన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని అధికారంలోకి తీసుకురావాలి

పి.గన్నవరం: వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ కార్యకర్తలంతా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి అన్నారు. పి.గన్నవరంలోని సబ్బితి కృష్ణప్రసాద్ ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న బహుజన మేళా సభలు మంగళవారం ముగిశాయి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత చీఫ్ జనరల్ మేనేజర్ కొల్లాబత్తుల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో పరంజ్యోతి మాట్లాడారు. బీఎస్పీ పి.గన్నవరం అభ్యర్థి సత్యం విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

నేడు సీహెచ్‌సీ ప్రారంభం

పి.గన్నవరం: 30 పడకలతో ఉన్న పి.గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.3 కోట్లతో 50 పడకల ఆస్పత్రిగా ఆధునీకరించారు. సీహెచ్‌సీ భవనంపై నాబార్డు నిధులతో కొత్త భవనాన్ని నిర్మించి 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశారు. దీనిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం ఉదయం ప్రారంభించనున్నారు. సీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా ఆధునీకరించడంతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరగనుంది. పేషెంట్ల కోసం మూడు ఇన్ పేషెంట్ల వార్డులు, ఒక ఐసీయూ వార్డు, ఆరు ప్రత్యేక గదులు, చిల్డ్రన్స్ వార్డు, హెచ్‌ఐవీ పేషెంట్ల కోసం ఐసీటీసీ కౌన్సెలింగ్ రూమ్, ల్యాబ్‌లు నిర్మించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రత్యేక చొరవ తీసుకుని సీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.